క్లుప్తంగా

2 వేల మందికి అన్నదానం

అల్లిపురం: జీవీఎంసీ 33వ వార్డు కుమ్మరవీధిలో శ్రీలక్ష్మీగణపతి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దసరా నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం మండపం వద్ద అన్నసమారాధన ఏర్పాటు చేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పచ్చిరిపల్లి రాము, వార్డు నాయకుడు పాల శ్రీహరి రెడ్డి, పీవీఎస్ రెడ్డిలు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సుమారు 2 వేల మంది భక్తులు అమ్మవారి అన్నప్రసాదం స్వీకరించారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన


వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఫరూఖీ

దాబాగార్డెన్స్: ఇత్తిహాద్ ముస్లిం కమ్యూనిటీ, హుస్సేన్ ట్రస్ట్ సంయుక్తంగా అపోలో హాస్పిటల్ సౌజన్యంతో ఆదివారం పాతపోస్టాఫీస్ సమీపాన మెహదీ బిల్డింగ్ వద్ద నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. బీపీ, ఆర్‌బీఎస్, ఈసీజీ, కంటి, యూరిక్ యాసిడ్, బీఎండీ తదితర వైద్య పరీక్షలు అపోలో ఆస్పత్రి వైద్యులు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. సుమారు 111 మంది వైద్య సేవలు పొందారు. ఎముకల వైద్యుడు డాక్టర్ అబ్దుల్ డి ఖాన్, పిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ ఫజుల్లా, దంత వైద్యులు సేవలందించారు. ఇత్తిహాద్ ముస్లిం కమ్యూనిటీ అధ్యక్షుడు ఐహెచ్ ఫరూఖీ అధ్యక్షతన నిర్వహించిన మెగా వైద్య శిబిరాన్ని వ్యాపారవేత్త అమీద్ ఆలీఖాన్ వైద్య ప్రారంభించారు. కార్యక్రమంలో ట్రస్ట్ కార్యదర్శి జాఫర్ హుస్సేన్, మున మెహిదీ, సుభీభవ డైరెక్టర్ హీ మీర్ అబ్బాస్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

బాడీ బిల్డర్లు సత్తా చాటాలి


బాడీ బిల్డింగ్ ఫైనల్ పోటీలు ప్రారంభిస్తున్న చెన్నా జానకీరామ్

దాబాగార్డెన్స్: మత్స్య పారిశ్రామిక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువు కోనాడ అప్పారావు జ్ఞాపకార్థం ఏర్పాటైన శ్రీరామ దూత వ్యాయామ మండలి నేతృత్వంలో నిర్వహిస్తున్న బాడీ బిల్డింగ్ ఫైనల్ పోటీలను ఆదివారం 37వ వార్డు కార్పొరేటర్, వైఎస్సార్‌సీపీ నాయకుడు చెన్నా జానకీరామ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలో వ్యాయామ మండలి లేకపోవడంతో స్థానిక బాడీ బిల్డర్లు వేరే ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేదన్నారు. ప్రస్తుతం రెల్లివీధిలోనే ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ ప్రాంతం బాడీ బిల్డర్లు మరింతగా ఉన్నత స్థాయికి ఎదిగి రెల్లివీధికి మంచి పేరు తేవాలని అభిలషించారు. కార్యక్రమంలో మండలి అధ్యక్షుడు రాజు, మత్స్య పారిశ్రామిక సంక్షేమ సంఘం ప్రతినిధి మురళీ, గంటా జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

4 కేజీల గంజాయి స్వాధీనం

మద్రిపాలెం : కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా గంజాయి రవాణా చేసేందుకు ప్రయత్నించిన ఇద్దరు వ్యక్తులను టాస్క్‌ఫోర్స్, ఐదో పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆదివారం సాయంత్రం కంచరపాలెం ఆర్‌పీ పేట బ్రిడ్జి కింద కేరళకు చెందిన పరియరుతు పర్బిల్ సుజిత్, అర్జున్ తొప్పిల్ ఒడిశా రాష్ట్రం నుంచి అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్నారన్న సమాచారం మేరకు పోలీసులు దాడి చేశారు. వారిద్దరినీ అదుపులోకి తీసుకుని 4 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వారిని రిమాండ్‌కు తరలించినట్లు కంచరపాలెం పోలీసులు తెలిపారు.


రామకృష్ణా జంక్షన్‌లో యూజీడీ మ్యాన్‌హోల్ వద్ద భారీ గొయ్యి


వెలంపేట వద్ద మ్యాన్‌హోల్ దుస్థితి

అస్తవ్యస్తం


నూనెమిల్లు వీధిలో అధ్వానంగా యూజీడీ

- అధ్వానంగా యూజీడీ మ్యాన్‌హోళ్లు
- రోడ్డెక్కి ప్రవహిస్తున్న మురుగు నీరు
- ఇబ్బందులు పడుతున్న స్థానిక ప్రజలు
- పట్టించుకోని యూజీడీ విభాగాధికారులు

జగదాంబ: జీవీఎంసీ యూజీడీ విభాగం నిద్రావస్థలో ఉందని ప్రజలు మండిపడుతున్నారు. డ్రైనేజీ వ్యవస్థను పట్టించుకోకపోవడంతో నిత్యం మ్యాన్‌హోళ్లు పొంగి రహదారులపై మురుగు పారుతోంది. మరికొన్ని చోట్ల మ్యాన్‌హోళ్లు అధ్వానంగా మారాయి. వీటి వల్ల ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారు. రోడ్డెక్కి మురుగు నీరు ప్రవహిస్తుండటం వల్ల వ్యాధులు సోకుతాయని భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు.

మురుగుతో సహవాసం

నగరంలోనే కీలకమైన పూర్ణా మార్కెట్ జన సంచారంతో నిత్యం రద్దీగా ఉంటుంది. ఇక్కడ మ్యాన్‌హోళ్లు పొంగడం, మరికొన్ని చోట్ల వాహనాల రాకపోకల వల్ల శిథిలమవడం తరచూ జరుగుతున్నాయి. జీవీఎంసీ యూజీడీ విభాగం అధికారులు ఈ సమస్యను కనీసం పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. అధ్వాన మ్యాన్‌హోళ్లు ప్రజారోగ్యానికి, వాహన చోదకులకు తలనొప్పిగా మారాయని చెబుతున్నారు. పూర్ణా మార్కెట్ పరిధిలోని రామకృష్ణ జంక్షన్, వెలంపేట, నూనెమిల్లు వీధి, బౌడారా రోడ్డుతోపాటు వార్డులో అన్ని చోట్లా యూజీడీలు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. వీధుల్లో యూజీడీ మ్యాన్‌హోళ్లు శిథిలమై దర్శనమిస్తున్నాయి. ఇదే వార్డులో గాజుల వీధి, కల్లుపాకలు ప్రాంతాల్లో ఏళ్ల తరబడి మురుగుతో యూజీడీలు నిండిపోయి ఉన్నాయి. వాటిని శుభ్రం చేయకపోవడంతో దోమల మధ్య సహజీవనం చేస్తున్నారని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


బౌడారా రోడ్డులో శిథిలమైన మ్యాన్‌హోల్

చర్యలు తీసుకుంటాం



జోన్ పరిధిలోని అన్ని వార్డుల్లో యూజీడీలను పరిశీలిస్తాం. ఎక్కడెక్కడైతే మ్యాన్‌హోళ్లు బాగో లేదో వాటిని గుర్తించి సంబంధిత అధికారులకు ఆదేశాలిచ్చి బాగు చేయిస్తాం.

– ఎం.మల్లయ్యనాయుడు, జోన్–4 కమిషనర్, జీవీఎంసీ

అన్నసమారాధనకు వాసుపల్లి ఆర్థిక సాయం

దాబాగార్డెన్స్ : జీవీఎంసీ 29వ వార్డు రామజోగిపేట గల్లీ క్రికెట్ బాయ్స్ నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాల మహా అన్న సమారాధనకు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. ముందుగా అమ్మవారికి వాసుపల్లి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం అన్నసమారాధన ప్రారంభించారు. ఈ సందర్భంగా వాసుపల్లి మాట్లాడుతూ ఏటా గల్లీ క్రికెట్ బాయ్స్ వైభవంగా నిర్వహిస్తున్న వేడుకలు ఈ ఏడాది కూడా కన్నుల పండువగా నిర్వహిస్తున్నారన్నారు. ఆ కనకదుర్గమ్మ ఆశీస్సులు దక్షిణ నియోజకవర్గ ప్రజలు, విశాఖ వాసులపై ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు కోరాడ సురేష్, బుల్లెట్ రవి, తమ్మినేని శ్రీను, మహేష్, మూర్తి, అడపా శివ, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.


అన్నసమారాధనకు ఆర్థిక సాయం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

సాగరగిరికి పోటెత్తిన భక్తజనం


దేవాలయ ప్రాంగణంలో అమ్మవారి దర్శనం కోసం వేచి ఉన్న భక్తులు


భువనేశ్వరీ దేవిలా కనకదుర్గమ్మ

- సౌకర్యాల లేమితో భక్తులకు అవస్థలు
- బోటు కోసం గంటల కొద్దీ నిరీక్షణ


బోటు కోసం బారులు తీరిన భక్తులు

అల్లిపురం: శరన్నవరాత్రి ఉత్సవాలతోపాటు ఆదివారం కావడంతో సాగరగిరి కనకదుర్గమ్మ గుడికి భక్తులు పోటెత్తారు. ఉదయం 6 గంటల నుంచే భక్తులు పాత పోస్టాఫీస్ దరి పోర్టు వెంకటేశ్వర స్వామి దేవాలయం వద్ద బోటు ప్రయాణం నిమిత్తం బారులు తీరారు. రద్దీకి తగ్గట్టు నిర్వాహకులు బోట్లు ఏర్పాటు చేయకపోవడంతో భక్తులు గంటలకొద్దీ నిరీక్షించాల్సి వచ్చింది. కనీసం టెంట్ సౌకర్యం కూడా లేకపోవడంతో చిన్నారులు, వృద్ధులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. ఒక పక్క ఎండ తీవ్రత, ఉక్కపోతతో దీర్ఘకాల వ్యాధులతో బాధపడుతున్న వారు అవస్థలు పడ్డారు. తీరా బోటు మీద అవతలి ఒడ్డుకు చేరుకున్న తర్వాత కొండపైకి వెళ్లిన వారికి తాగునీరు, వాడుక నీరు లేక ఇబ్బందులు పడ్డారు. కనీసం అక్కడ పట్టించుకునే వారు లేకపోవడంతో అవస్థలు పడ్డారు. అమ్మవారిని దర్శించుకునే భక్తులకు తగిన సౌకర్యాలు కల్పిస్తే మరింత మంది తరలి వస్తారని పలువురు అభిప్రాయపడ్డారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సాగరగిరి కనకదుర్గమ్మ ఆదివారం భువనేశ్వరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు ఫణి కుమార్ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష పూజలు చేశారు.

లండన్‌లో ఎస్పీ బాలుకు స్వర నివాళి

దాబాగార్డెన్స్: గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం 4వ వర్ధంతిని పురస్కరించుకుని లండన్‌లోని పిన్నర్‌లో భగవాన్స్ సోల్‌ఫుల్ పేరిట నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమం విజయవంతమైందని ఆయా సంస్థల విశాఖ ప్రతినిధులు భగవాన్, రాజేశ్వరి తెలిపారు. ఎస్పీ బాలును స్మరించుకుంటూ 300 మందికి పైగా సంగీత ప్రియులు పాల్గొన్నారని చెప్పారు. కార్యక్రమంలో ప్రధాన ఆకర్షణగా నిలిచిన టాలీవుడ్ ప్లేబ్యాక్ సింగర్ మల్లికార్జున సంగీత ప్రదర్శన ప్రేక్షకులను అలరించిందన్నారు. భగవాన్, మల్లికార్జున కలిసి ఆలపించిన ఇంద్ర సినిమాలోని ఝుల్లు ఝుల్లుమని పాట హైలైట్‌గా నిలిచిందని పేర్కొన్నారు. లండన్‌లో నాలుగేళ్లుగా ఎస్పీబీ లివ్స్ ఆన్ ఈవెంట్ నిర్వహిస్తూ వస్తున్నామని నిర్వాహకులు తెలిపారు.


లండన్‌లో ఎస్పీ బాలు వర్ధంతి కార్యక్రమంలో ప్లేబ్యాక్ సింగర్ మల్లికార్జున, భగవాన్, రాజేశ్వరి

నవ్వులు పంచిన ‘వినోదాల విందు’

సీతంపేట : ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ నిర్వహించిన ‘వినోదాల విందు’ కార్యక్రమం ఆద్యంతం నవ్వులు పూయించింది. క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.వి.సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆదివారం సాయంత్రం కళాకారులు ఉత్సాహంగా పాల్గొని పలు కామెడీ స్కిట్స్ ప్రదర్శించి ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించారు. వీటిలో డ్రైవర్ ఉద్యోగం, పండగకి వస్త్రా, నైటీ, 6 నెలలు, పెళ్లాం కంట్రోల్, పక్కింటి ఆంజనేయులు, పెళ్లి చూపులు, దెయ్యాలు, ఫ్రిజ్ స్కిట్స్ ఆహూతు లను అలరించాయి. కళాకారులు ఎం.వి.సుబ్రహ్మణ్యం, జబర్దస్త్ ప్రకాష్, డేవిడ్ రాజు, కుమారి, అడవి రాజు, భాను, రాజు, నాయుడు, పోర్టు శేషు, మల్లిక, శంకర్ స్కిట్స్ ప్రదర్శించారు. అనంతరం కళాకారులను నండూరి రామకృష్ణ, తిలక్ సత్కరించారు.

సీపీ విజిట్

అల్లిపురం: నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ప్రతి రోజూ ఒక లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్ ను సందర్శిస్తూ సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నా రు. శనివారం రాత్రి ఆయన వన్ టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలోని ఈస్ట్ ట్రాఫిక్ ఏసీపీ కార్యాలయాన్ని సందర్శించారు. ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో సిబ్బంది విధులపై సమీక్షించారు. జోన్–1 ట్రాఫిక్ పరిధిలోని సమస్యలు, కేసుల గురించి తెలుసుకుని, రికార్డులన్నీ సక్రమంగా ఉన్నదీ లేనిదీ పరిశీలించారు. అధికారులకు ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను సీపీ వివరించారు.


ఈస్ట్ ట్రాఫిక్ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

కారును ఢీకొట్టిన లారీ

ముగ్గురికి గాయాలు


ప్రమాదంలో కాలు విరిగిపోయిన అనురాధ


డివైడర్ పైకి దూసుకుపోయిన కారు

అగనంపూడి: కారును వెనుక నుంచి లారీ ఢీకొట్టిన సంఘటనలో మహిళకు కాలువిరిగిపోగా, మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. దువ్వాడ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జగదాంబ ప్రాంతానికి చెందిన ఐఎంరావు కుటుంబ సభ్యులు అనురాధ, సుజాతలతో కలిసి కారులో కొవ్వూరు వెళ్తున్నారు. అగనంపూడి సెక్టార్–1 కాలనీకి ఎదురుగా వచ్చేసరికి కారును వెనుక నుంచి లారీ ఢీకొంది. దీంతో కారు డివైడర్ పై నున్న వీధి దీపాల స్తంభాన్ని ఢీకొట్టి డివైడర్ పైకి దూసుకుపోయింది. దీంతో అనురాధ ఎడమ కాలు విరిగిపోయింది. మిగిలిన ఇద్దరూ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. వీరిని చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు.

మానసిక ఆస్పత్రి నుంచి యువకుడి అదృశ్యం

టీబీరోడ్డు: మానసిక వైద్యం పొందుతున్న ఓ యువకుడు అదృశ్యమైనట్లు మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. ప్రకాశం జిల్లాకు చెందిన వెంకట సంజయ్‌కుమార్‌కు మానసిక స్థితి సరిగా లేకపోవడంతో అతడి తల్లిదండ్రులు గత నెల 29న ఇక్కడి మానసిక వైద్యశాలలో చేర్పించారు. శనివారం మధ్యాహ్నం ఒంటి గంటకు ఆస్పత్రి వార్డు నుంచి బయటకు వెళ్లిన సంజయ్ తిరిగి రాలేదు. ఆస్పత్రి బయట వెతికినా కనిపించలేదు. దీంతో ఆదివారం సంజయ్ తల్లిదండ్రులు త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు ఈ మిస్సింగ్ కేసును హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖర్‌కు అప్పగించారు. సంజయ్ ఆచూకీ తెలిస్తే పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు.


వెంకట సంజయ్ కుమార్

ఆదిపరాశక్తి నమోస్తుతే


అన్నపూర్ణాదేవి అలంకరణలో దుర్గాలమ్మ

దాబాగార్డెన్స్: నియోజకవర్గంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదిపరాశక్తిని భక్తులు దర్శించుకుని తరిస్తున్నారు. జీవీఎంసీ 35వ వార్డు పూర్ణా మార్కెట్ వెలంపేటలో వెలసిన దుర్గాదేవి ఆలయంలో శరన్నవరాత్రుల ఉత్సవాల్లో అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. భవానీ మాలధారులు ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం లలితా త్రిపుర సుందరిదేవిగా దుర్గాలమ్మ దర్శనమివ్వనున్నారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.


అమ్మవారికి పూజలు చేస్తున్న పూజారమ్మ విజయమ్మ

లలితాత్రిపుర సుందరిగా ఎర్నిమాంబ

కంచరపాలెం: జ్ఞానాపురం పరిధి కాన్వెంట్ కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. దేవదాయ శాఖ ఈవో డీవీఎస్ సురేష్‌బాబా నేతృత్వంలో ఎర్నిమాంబ అమ్మవారిని పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ ప్రత్యేకంగా అలకంరించారు. శరవన్నరాత్రి ఉత్సవాల్లో భాగంగా 4వ రోజు అమ్మవారు లలితా త్రిపుర సుందరిదేవిగా దర్శనమిచ్చారు.


లలితాత్రిపుర సుందరీదేవిగా ఉమాదేవి

అర్చకులు పులఖండం శ్రీకాంత్ శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. ఆలయ సిబ్బంది రామకృష్ణ, ప్రసాద్, కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

అల్లిపురం: శ్రీ శివరామకృష్ణ దేవస్థానంలోని ఉమాదేవి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. అమ్మవారు లలితా త్రిపుర సుందరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అర్చకుడు భార్గవశర్మ ఆధ్వర్యంలో విశేష పూజలు చేశారు.

సుభోజనం.. పర్యావరణ హితం

కేజీహెచ్‌లో సుభోజనం పేరిట రోగులు, వారి సహాయకులకు ఉచిత భోజన సేవలను విస్తరిస్తున్న క్రమంలో షెడ్డు నిర్మాణానికి అనుమతి ఇచ్చారు. ఆ స్థలంలో నాలుగు చెట్లు ఉండటంతో వాటిని తొలగించకుండా స్థలాన్ని కలుపుతూ షెడ్డు నిర్మించి సేవలు కొనసాగిస్తున్నారు. పేదల సహాయంలోనే కాకుండా పర్యావరణ పరిరక్షణలో కూడా హరే కృష్ణ మూవ్‌మెంట్, టచ్ స్టోన్ చారిటీస్ ఆలోచించి షెడ్డు నిర్మించడం విశేషం. సుభోజనం షెడ్డు లోపలి భాగంలో చెట్ల వల్ల ఎటువంటి ఇబ్బంది లేకుండా నిర్మాణం చేపట్టారు.

– ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం





చట్టాలతో బాధితులకు మరింత మేలు


సమావేశంలో మాట్లాడుతున్న శ్యాంప్రసాద్

దాబాగార్డెన్స్ : చట్టాలు మరింత సులువుగా మారాయని, ప్రస్తుతం అమల్లో ఉన్న చట్టాలతో ఫిర్యాదుదారులకు కొంత మేలు జరగనుందని హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ రాష్ట్ర కార్యదర్శి ఎం.శ్యాంప్రసాద్, విశాఖపట్నం బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావు పేర్కొన్నారు. హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఆదివారం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఏ స్టేషన్ పరిధిలో నేరం జరిగితే ఆ స్టేషన్‌లోనే ఫిర్యాదు చేయాల్సి ఉండేదని, ప్రస్తుతం ఆ పరిస్థితిలో మార్పు వచ్చిందన్నారు. జీరో ఎఫ్ఐఆర్ అందుబాటులోకి వచ్చిందని చెప్పారు. ఎవరైనా భూమిని ఆక్రమిస్తే సివిల్ కేసు కింద కోర్టుని ఆశ్రయించవచ్చని చెప్పారు. మహిళలపై వేధింపులు, లైంగిక దాడుల కేసుల గురించి వివరించారు. అనంతరం మానవ హక్కుల న్యాయస్థానాలు, ప్రాథమిక పాత్రపై వివరించారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది లక్ష్మీ రాంబాబు, హ్యూమన్‌రైట్స్ కౌన్సిల్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు ఎస్‌పీ రమణ, గుండు అప్పలరాజు పాల్గొన్నారు.

పోర్టు నిధులతో ఆస్పత్రి నిర్వహించాలి


పోర్టు హాస్పిటల్ వద్ద రిలే నిరాహార దీక్షలో నాయకులు

తాటిచెట్లపాలెం : సాలగ్రామపురంలోని విశాఖపట్నం పోర్టు అథారిటీ హాస్పిటల్‌ను పీపీపీ పద్ధతిలో ప్రైవేటు వ్యక్తులకు అప్పగించాలనే ప్రతిపాదన విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ నాయకులు కొనసాగిస్తున్న రిలే నిరాహారదీక్షలు ఆరో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు కె.సత్యనారాయణ మాట్లాడుతూ కేంద్ర మంత్రి సర్బానంద్ సోనోవాల్ ప్రకటించిన విధంగా పోర్టు ఆస్పత్రిని ప్రైవేటు వ్యక్తులకు అప్పగించాలనే ప్రతిపాదనను వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. లాభాల్లో నడుస్తున్న పోర్టు నిధులతో ఆస్పత్రిని నిర్వహించాలని కోరారు. వెంటనే నిర్ణయాన్ని ఉపసంహరించుకోకపోతే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.